క్లుప్తంగా

నేడు బంగారమ్మ పండగ



బంగారమ్మతల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మ తల్లి పండగ మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. పాత అడవివరంలోని అమ్మవారి శతకం పట్టు నుంచి రాత్రి ఘటాలను పూజారి వంశీయులైన లండ వంశస్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. అమ్మవారిని గ్రామస్తులు, భక్తులు దర్శించుకోవాలని లండ వంశస్తులు పిలుపునిచ్చారు. అమ్మవారి నూతనంగా ఆలయం నిర్మాణం జరుగుతుండడంతో బాలాలయంలోనే పూజలు నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులంతా స్వీయ నియంత్రణ, క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు



సరస్వతీదేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. ముందుగా సరస్వతీదేవి పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో ఓనమాలు దిద్దించి అక్షర శ్రీకారం చుట్టారు. పాఠశాల చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్‌నాయుడు, సీజీఎం వసంత, జీఎం రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షుడిగా త్రిమూర్తులు



నూతన అధ్యక్షుడు త్రిమూర్తులను అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు గొర్లివానిపాలెం విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా నెక్కల త్రిమూర్తులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డెయిరీ సూపర్ వైజర్ సత్యనారాయణ అధ్యక్షతన పాలసొసైటీ వద్ద జరిగిన ఎన్నికల్లో పాల సొసైటీ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేతన కార్యదర్శి రొంగలి పైడన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు గొర్లి స్వామినాయుడు, ఎంపీటీసీ గొర్లి చైతన్య, పాడి రైతులు బాదిరెడ్డి లక్ష్మణ, గండి దేముడు నూతన అధ్యక్షుడిని అభినందించారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ-మెయిల్ ఐడీ endow-eokanaka@gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

పింఛన్ల పంపిణీలో తలోదారి

- వేర్వేరుగా పింఛన్లు అందించిన ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ
- బహిర్గతమైన ఆధిపత్య పోరు
- ఒక్కచోటా కలవని ఇద్దరు నేతలు



పినగాడిలో పింఛన్ అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



రాంపురంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో వేరు కుంపటి ఆధిపత్య పోరు మొదలైంది. జనసేన నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీ తలోదారి పట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన ఎన్టీఆర్ పింఛన్ పంపిణీ కార్యక్రమం సందర్భంగా సోమవారం కూటమిలో కుమ్ములాటలు తేటతెల్లమయ్యాయి. లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం షెడ్యూల్ ఒకరికి ఒకరు చెప్పకుండా పంచకర్ల, బాబ్జీ తమ ఉనికిని చాటుకునేందుకు తాపత్రయపడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం కోసం పింఛన్లు పంపిణీ చేసిన ఇరువురు నేతలు కలిసి ఒక్కరికీ పింఛన్ ఇవ్వలేదు. బయటకు మేమంతా ఒక్కటే అని డాంబీకాలు పలికినా..సమయం వచ్చేసరికి ఇద్దరు నేతలు ఎవరి ప్రచార యావలో వారు మునిగిపోయి తమ ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు గత ఐదేళ్లు ఎలాంటి అలజడి లేకుండా పింఛన్లు అందుకున్న అవ్వాతాతలు కూటమి చోటా మోటా నేతల ఓవరాక్షన్‌కు హడలిపోయారు. తమ తమ పార్టీల ఆధిపత్యం కోసం ఎక్కడికక్కడ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి టీడీపీ-జనసేన నాయకులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. కాగా కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నేతలు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోదిలో కూడా లేరు.

అక్కడే చెడింది?

వాస్తవానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు-టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీకి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే చెడినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో ప్రారంభం కానున్న అధికారుల బదిలీల జాబితా విషయంలో ఇరువురి మధ్య విభేదాలు వచ్చాయి. ఎమ్మెల్యేగా తనకు అధికారులను బదిలీ చేసే సర్వ అధికారాలు ఉన్నాయంటూ పంచకర్ల రమేష్‌బాబు తన సొంత జాబితాను ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే కూటమి పెద్దన్నగా ఉన్న టీడీపీ తరఫున ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీ కూడా తన హోదాకు తగ్గ అధికారుల బదిలీల కోసం సిఫార్సులు చేసేందుకు జాబితా సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి జాబితాలు బయటకు రావడం..ఆయా జాబితాలకు పొంతన కుదరకపోవడంతో ఇద్దరి మధ్య 'గాప్' వచ్చింది. తాజాగా సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అది మరింత పెరిగిందని స్వయంగా కూటమి కోటరీయే చెవులు కొరుక్కుంటోంది.

పింఛన్ల పంపిణీ

జీవీఎంసీ 93, 94, 95, 96, 97వ వార్డుల్లో, మండలంలోని సరిపల్లి, రాంపురం గ్రామాల్లో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందించారు. జీవీఎంసీ 93, 94, 95, 96, 97వ వార్డుల్లో, పినగాడి గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ పింఛన్లు అందించారు. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, శానాపతి వసంత, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటికే పింఛన్

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



బొండవానిపాలెంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

సబ్బవరం: లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్లు అందించనున్నట్టు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలోని గొటివాడ శివారు బొండవానిపాలెంలో సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి లబ్ధిదారునికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. మిగిలిన పింఛన్లను మంగళవారం పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట ఈవోఆర్డీ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వెలుగు ఏపీఎం సాయి రమేష్ పాల్గొన్నారు.

- సబ్బవరంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేతులమీదుగా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి



గంగయ్య(ఫైల్)

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివారు అమరపిన్నివానిపాలెం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీ కొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు.బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన నేబర్తి పైడిరాజుకు అమరపిన్నివానిపాలెంలో మామిడి తోట ఉంది. ఆ తోటను వెదుళ్లనరవకు చెందిన ఎస్‌కే హలీమ్ లీజుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. సదరు మామిడి తోట పనులు చేసేందుకు విజయనగరం జిల్లా ఎస్.కోటలోని బర్మా కాలనీకి చెందిన గొర్లి గురయ్య(45)ను నియమించాడు. భార్యతో కలిసి గురయ్య మామిడి తోటలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మామిడి తోట చదును చేసే పనుల్లో భాగంగా ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తుండగా గురయ్యను ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతి చెందాడు. అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమార్తె వెంకటలక్ష్మి,ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమారుడు సతీష్ ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారు బోరున విలపించారు.ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీకి సామగ్రి వితరణ



టీవీ అందిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం అభిషేక్ కుమార్

పెందుర్తి: ఐసీడీఎస్ పెందుర్తి సెక్టార్ రాచ్చెరువులోని అంగన్‌వాడీ కేంద్రానికి పెందుర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ పలు సామగ్రి అందించింది. ఎస్‌బీఐ ఆర్థిక సహాయంతో టీవీ, వాటర్ ఫిల్టర్, గ్లాసులు, ప్లేట్లు, ఆట వస్తువులను సమకూర్చారు. ఆయా సామగ్రిని సోమవారం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అభిషేక్ కుమార్ చేతుల మీదుగా సీడీపీవో నీలవేణికి అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బాషా రంజిత్ కుంటియా, అంగనవాడీ కార్యకర్తలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో సువర్ణ, సత్యసాయి భక్త బృందం ప్రతినిధులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని భగవాన్ సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం పుస్తకాల వితరణ చేశారు. పెందుర్తి ఎంఈవో-1 సువర్ణ చేతుల మీదుగా గిరిప్రసాద్‌నగర్, పాపయ్యరాజుపాలెం, గొల్లవిల్లివానిపాలెం, పురుషోత్తపురంలోని మొత్తం 350 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, స్కేళ్లు, బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో దాతలు హిమగీత, ప్రత్యూష, దుర్గాప్రసాద్, సత్యసాయి భక్త బృందం ప్రతినిధులు ముక్కా గోపి, పి.తాతారావు, టి.సీతారామయ్య, సి.హెచ్ రవిశంకర్, పి.ఎస్ మూర్తి, సీహెచ్ భవాని, పి.దివ్య, నాగమణి, వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా యాజమాన్యాలపై చర్యలకు డిమాండ్

పరవాడ: ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరు, సముద్రంలో వ్యర్థ జలలాలు కలవడానికి కారణమైన ఫార్మాసిటీ, ఎన్టీపీసీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముత్యాలమ్మపాలెం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు డిమాండ్ చేశారు. రసాయనాల కారణంగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో పాటు పరవాడ తహసీల్దారు తిరుపతిరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉప్పుటేరులో ఫార్మా వ్యర్థ రసాయనాలు కలవడంతో లక్షల విలువైన మత్స్య సంపద చనిపోయిందన్నారు. దీనికి బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అచ్చిబాబు కోరారు.

అతిసారతో ఒక్కరూ చనిపోరాదు



సభలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

దాబాగార్డెన్స్ : టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి సేవలో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓం ఫ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

ఎంవీపీ కాలనీ: ఓం ఫ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకు గాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం ఫ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్' లభించిందన్నారు. గత 11 ఏళ్లుగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

దాబాగార్డెన్స్ : అల్లూరి 127వ జయంతోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల పిల్లలు, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మరిన్ని వివరాలకు 94907 50661లో సంప్రదించాలని సూచించారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఏయుటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం: రైల్వే స్టేషన్లో భిక్షాటన చేసుకుంట న్న మహిళకు ఆశ్రయం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు ఏయూటీడీ సిబ్బంది. వివరాలివి.. లక్ష్మి అనే మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేసు కోవడంతో ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి, ఇటీవల టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌లో వసతి కల్పించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పద్మనాభం మండలంలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఇంటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేయాలని ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు.

న్యాయ సంహిత చట్టం రద్దు చేయాలని ఆందోళన



లంకెలపాలెంలో ఆందోళన చేస్తున్న ఆటో రిక్షా కార్మిక యూనియన్ నాయకులు

పరవాడ: భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. లంకెలపాలెం కూడలిలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో రిక్షా కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో పేర్కొన్న సెక్షన్ 106/(1), (2) డ్రైవర్లకు గుదిబండగా మారిందన్నారు. యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకు ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించడానికి ఆస్కారం ఉన్న ఈ చట్టం అత్యంత ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టకుండా డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో లంకెలపాలెం ఆటో యూనియన్ నాయకులు ఎన్.గోవింద్, కె.అప్పారావు, ఎన్.ముసిలి, డి.మధు, వై.నాగేష్, ఎస్.సన్యాసిరావు, రాంబాబు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.

మొరాయించిన సర్వర్లు



ముత్యాలమ్మపాలెంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: సర్వర్లు మొరాయించడంతో పరవాడ, వెన్నలపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది.

- పరవాడలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పైల జగన్నాథరావు, 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో కీర్తి స్పందన తదితరులు పాల్గొన్నారు.
- తానాం పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ పింఛన్లు అందజేశారు. సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.
- తాడి గ్రామంలో మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, కూటమి నాయకులు, నాయుడుపాలెంలో మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు మధు తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.
- ముత్యాలమ్మపాలెంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.

పాత అడవివరంలో పింఛన్ల పంపిణీ



పాత అడవివరంలో పింఛన్ అందజేస్తున్న గంటా శ్రీనివాసరావు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పాత అడవివరంలో సోమవారం జరిగిన ఇంటింటి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు స్వయంగా పింఛను నగదు అందజేశారు.ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత ఇంటికే పింఛన్ అందించే కార్యక్రమాన్ని పండగలా నిర్వహించడం జరుగుతోందన్నారు.

భీమిలి నియోజకర్గంలో 31కోట్ల 71లక్షల 10 వేలు రూపాయలు పింఛన్ దారులకు అందిస్తున్నట్లు తెలిపారు. పంచగ్రామాల భూసమస్య, బీఆర్‌టీఎస్ సమస్యలపై దృష్టిపెట్టి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, పార్టీనాయకులు కోరాడ రాజబాబు, సతివాడ శంకరరావు, లండ శ్రీను, దొంతల సంతోష్ పాల్గొన్నారు.

వారంలో ఒకరోజు ప్రజారవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

1236వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

అగనంపూడి: ప్రమాదపుటంచుల్లోకి నెట్టబడిన విశాఖ ఉక్కుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవారానికి 1236వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే సాధ్యమన్నారు. ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరించకపోతే రాష్ట్ర ప్రజలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలపై పెట్టుకున్న నమ్మకం కూడా పోతుందని అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా అగమ్యగోచరంగా ఉన్న విశాఖ ఉక్కును సరిదిద్దడానికి సంకీర్ణ ప్రభుత్వంలోని మూడు పార్టీల నాయకులు కదలి రావాలన్నారు. కార్యక్రమంలో దాసరి సురేష్, కామేశ్వరరావు, శ్రీనివాస్, సీతారామరాజు బషీర్‌బాబు, రామకృష్ణ, గోపాలరాజు, రాజేంద్రనాథ్, భాస్కరరావు పాల్గొన్నారు.